భక్తులతో కిక్కిరిసిన విజయనగరం పైడితల్లమ్మ ఆలయ మార్గం

నేటి శ్రీ పైడితల్లమ్మ సిరిమానోత్సంకు విస్తృత ఏర్పాట్లు

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో అక్టోబరు 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్న శ్రీ పైడితల్లమ్మ తొలేళ్ళు, సిరిమానోత్సవం సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిందని రాష్ట్ర హోంశాఖ మరియు డిజాస్టర్ మేనేజ్మెంట్ మంత్రివర్యులు వంగలపూడి అనిత అక్టోబరు 14న తెలిపారు. శ్రీ పైడితల్లమ్మను సందర్శించేందుకు విచ్చేసిన రాష్ట్ర హోంశాఖ మంత్రివర్యులకు స్థానిక ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు, పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఇతర అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ అధికారులు మంత్రివర్యులకు మేళ తాళాలతో స్వాగతం పలకగా, మంత్రి అమ్మవార్కి ఘటాన్ని సమర్పించారు. అనంతరం, వేద పండితులు ఆశీర్వచనం అందించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేసారు. అనంతరం, రాష్ట్ర హోంశాఖా మంత్రి ఆలయం వద్ద జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసిన తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించి, బందోబస్తు, భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసుశాఖ చేపట్టిన భద్రత చర్యలను, బందోబస్తు ఏర్పాట్లును రాష్ట్ర మంత్రికి వివరించారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసినట్లు, పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతను కమాండ్ కంట్రోల్ రూం నుండే పర్యవేక్షించే విధంగాను, సందర్భనుసారంగా అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మంత్రివర్యులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మ సిరిమానోత్సవంకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీసుశాఖ 2000మందితో బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు టిక్కెట్స్ విక్రయాలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పట్టణంలో 80 సిసి కెమెరాలను వివధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ రూం నుండి పర్యవేక్షించే విధంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ చర్యలు చేపట్టారన్నారు. ఆకతాయిల ఆట కట్టించేందుకు ప్రత్యేకం షీ టీమ్స్, దొంగతనాలను, జేబు దొంగతనాలను నియంత్రించేందుకు క్రైం టీమ్స్, దివ్యాంగులు, వృద్ధులకు దర్శనం కల్పించడంలో సహాయాన్ని అందించేందుకు పోలీసు సిబ్బందితో సేవాదళ్ ను, ప్రజలకు సహాయ పడేందుకు మూడు పోలీసు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడంతోపాటు, ట్రాఫిక్ రెగ్యులేషనుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, స్థానిక ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, ప్రజా ప్రతినిధులు, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, సిహెచ్. సూరి నాయుడు, పలువురు ఎస్ఐలుమరియు ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

ఉత్సాహభరిత వాతావరణంలో క్రీడలు

విశాలాంధ్ర-విజయనగరం పోర్ట్ : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులపాటు విజ్జి స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా ప్రారంభమై ఉత్కంఠ భరిత వాతావరణంలో సోమవారం రాత్రి ముగిశాయి. ఇందులో వాలీబాల్ కబాఢీ ,ఖోఖో, బ్యాడ్మింటన్, స్కేటింగ్ ,విభాగాల్లో మహిళలు, పురుష జట్లు తలపడ్డాయి. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అనకాపల్లి ,తూర్పుగోదావరి, విశాఖపట్నం, జిల్లాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు తరలివచ్చారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహక కమిటీ ప్రతినిధులు ప్రశంసా పత్రాలు నగదు ప్రోత్సాహకాలు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్ .డీ.ఒ ఎస్.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పండగకై బందోబస్తు, భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: అక్టోబరు 14న శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్ళు పండగ సందర్భంగా పట్టణంలోని శ్రీ పైడితల్లి అమ్మవారి దేవాలయం, కోట జంక్షన్, కమాండ్ కంట్రోల్ జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించి, బందోబస్తు, భద్రత ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి, భద్రత విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి భద్రతాపరమైన పలు సూచనలు చేశారు.

పల్లెల్లో అభివృద్ధి పండుగ : ఎంపీడీవో భాస్కరరావు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో గడిసిన ఐదేళ్లో కాలంలో గ్రామలన్నీ అభివృద్ధి నోచుకోని దుస్థితి. కనీసఅవసరాలు నోచుకోక, గెలిచిన సర్పంచులు అభివృద్ధి చేయలేక నిధులు కొరతతో అవస్థలు పడ్డారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా విద్యుత్ బిల్లుల సాకుతో పక్కదారి పట్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామాలకు సాకారం చేసుకునేందు నడుం బిగించింది. అందులో భాగంగానే ఈనెల 14 నుండి 20వరకు “పల్లె పండుగ” పేరుతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. మెరకముడిదాం మండలంలో మాత్రం 17 న ప్రారంభం కానున్నది. మండలం మొత్తం నిధులు ఐదు కోట్ల 30 లక్షలు మంజూరయ్యాయి. కనీస అవసరా లైనా రోడ్లు మురుగు కాలువలు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సిసి రహదారులు, తాగునీరు వంటి సమస్యల పరిష్కారం పై డ్రైనేజీ కాలువలు, పశువుల షెడ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు.

ఎస్ కోటలో బిజెపి సభ్యత్వాలు నమోదు

విశాలాంధ్ర -శృంగవరపుకోట: శృంగవరపుకోట దేవి కూడలి వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి బిజెపి పార్టీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎస్.కోట భాజపా శ్రేణులు వేగవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి, శృంగవరపుకోట నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఇన్చార్జ్ శ్రీరంగం దానేష్, వరాది చిరంజీవి యాదవ్, ఎస్ కోట మండల అధ్యక్షులు ఎస్సార్ వి రూపేష్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోన మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో కోర్ట్‌ఫీస్ స్టాంపులు అందుబాటులో తేవాలి

భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షులు కందాపు

విశాలాంధ్ర-బొబ్బిలి: స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గత రెండు నెలల నుండి కోర్ట్ ఫీస్ స్టాంపులు లభ్యం కావడం లేదని దీంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత శాఖ అధికారులు సమస్యను పరిష్కారం చేయాలని భారత న్యాయవాదుల సంఘం ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు, భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కందాపు ప్రసాదరావు డిమాండ్ చేశారు. సోమవారం. భారత న్యాయవాదుల సంఘం ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు కందాపు విలేఖరితో మాట్లాడారు. సబ్ రిజిస్టర్ అధికారికి సమస్య తెలియజేసిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కోర్టు ఫీస్ స్టాంపులు ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

పల్లె పండగలతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు

ఎంపిడివో నీలం అప్పలనాయుడు

విశాలాంధ్ర-జామి: ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె పండగ కార్యక్రమాలతో గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని ఎంపిడివో నీలం అప్పలనాయుడు అన్నారు. మండలంలో పల్లె పండగ ప్రారంభ కార్యక్రమం జాగరం, తానవరం గ్రామాలలో సోమవారం నిర్వహించారు. జాగరం గ్రామంలో రూ.10లక్షలతో సిసిరోడ్‌కు, తానవరంలో రూ.10లక్షలతో 3 పనులకు గాను సోమవారం శంఖుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాగరంలో పనులకు ఎంపిడివోతోపాటు స్థానిక టీడీపీ నేత రెడ్డి పైడిబాబు శంఖుస్థాపన చేసారు. ఈకార్యక్రమాలలో మండల టీడీపీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు, ప్రధానకార్యదర్శులు వర్రిరమణ, దనియాల పైడిరాజు, రాయవరపు శ్రీను, బండారు జగన్నాథం, గనివాడ ఎర్నాయుడు, గొర్లె ఎర్నాయుడు, కొటాన దేముడు, ఎపివో కిరణ్మయి, గ్రామ కార్యదర్శి అనూరాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జాగరంలో జరిగిన కార్యక్రమానికి వైసీపీ వర్గీయులు హాజరుకాలేదు.

ఆనందగజపతి కళాక్షేత్రంలో విశేషాలు..

విశాలాంధ్ర -విజయనగరం: విజయనగరంఉత్సవాలలో భాగంగా పట్టణంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో రెండోరోజు జరిగిన ఆనందగజపతి కళాక్షేత్రంలో ఇంచార్జ్ అధికారులుగా ఉన్న గ్రామీణ నీటి సరఫరా ఎస్.ఈ ఉమాశంకర్, ఎం.ఆర్ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రీ, డివిజనల్ పి.ఆర్.ఓ జానకమ్మ ముగ్గురూ పాడడం విశేషం. వీనుల విందుగా ఆలపించడంతో ప్రాంగణమంతా హర్షధ్వానాలు మిన్నంటాయి.

పీడిత ప్రజల హక్కులకై జైలు జీవితం గడిపిన ప్రొ॥ సాయిబాబా జీవితం ఆదర్శనీయం

ఘన నివాళులు అర్పించిన వక్తలు

విశాలాంధ్ర-బొబ్బిలి: మానవ హక్కుల నేత, ప్రముఖ రచయిత, ప్రజా ఉద్యమకారుడు ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా అకాల మరణం పట్ల పట్టణం కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో సిపిఐ. సిపిఎం. ప్రగతిశీల కార్మిక సమైక్య పీకేఎస్. రైతు సంక్షేమ సంఘం. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నిరంకుశ విధానాలపైన గొంతు విప్పితూ, అడవుల నుండి ఆదివాసీలను వెడలుకొట్టి ఖనిజ సంపదను కార్పొరేట్ మల్టీ నేషనల్ కంపెనీలకు బహుళ జాతి కంపెనీలకు అప్పగించడానికి చేస్తున్న కుట్రలను ఎదిరిస్తూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాటం చేస్తు తాడిత పీడిత ప్రజల కోసం అండగా ఉంటూ చైతన్యవంతం చేస్తున్నాడని ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబాను అనేక చిత్రహింసలకు గురిచేశారని పలువురు నేతలు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అడవుల్లో ఆదివాసీలు హక్కుల కోసం పక్షాన నిలిచిన నేరానికి అర్బన్ నక్సలైటుగా, మావోయిస్టు యాక్టివిస్టుగా ముద్ర వేయబడి పదేళ్ల జైలు శిక్షలతో అనారోగ్యం పాలైన ప్రొఫెసర్:సాయిబాబా అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. 90శాతం అంగవైకల్యంతో అమలాపురం నుండి హైదరాబాదుకు అక్కడి నుండి ఢిల్లీ యూనివర్సిటీ దాకా ప్రజా ఉద్యమాల సారధి సాగించిన పయనం ఎంతోమందికి ఆదర్శనీయం అన్నారు. తీవ్రమైన రాజ్య హింసలో, అకారణ శిక్షల మధ్య దశాబ్దం పాటు తీవ్రమైన నిర్బంధంలో జైలు జీవితం గడిపిన ఆయన జీవితం నుండి నేటి యువత నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. దేశద్రోహ చట్టాలతో, ఉపా లాంటి నిరంకుశ చట్టాలతో నిరపరాధిగా నిరూపించుకునే బాధ్యత రాజ్యం నుండి ముద్దాయికి సంక్రమించడం, పదేళ్ల తర్వాత నిరపరాధిగా తేల్చడమే అతని మరణానికి మూలకారణం అన్నారు. అందుకే ఇది రాజ్యం హత్య తప్ప మరొకటి కాదన్నారు.భారత న్యాయ సంహిత పేరిట వలస చట్టాలను మరింత పదును పెడుతున్న దుర్మార్గాన్ని, ప్రజాస్వామిక వాదు ల గొంతు నొక్కి, దండ కారణ్యం లో ప్రజలపై అధర్మ యుద్ధాన్ని సాగిస్తున్న పాలక కుట్రలకు వ్యతిరేకంగా పోరాడటమే,జి.యన్ సాయిబాబాకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అత్యాచారాలు. మేధావులను పాత్రికేయులను హత్యలు చేసే వాళ్లకు బ్యాంకులో సొమ్మును దోచేసిన వాళ్లకు. బెయిలు మంజూరు చేసి. ప్రజా సమస్యలపైన రాజ్యాంగం గురించి మాట్లాడిన వారిని. అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరించి జీవిత ఖైదీలుగా జైల్లో మగ్గించడం ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కూని చేయడమేనని అన్నారు ప్రజా సంఘాల తరపున ప్రొఫెసర్ సాయిబాబా కు ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు. రంప రాఘవరావు. సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్. సిపిఎం పట్టణ కార్యదర్శి పి శంకర్ రావు. పికేఎస్ జిల్లా అధ్యక్షులు రాయిలీ సత్యం. రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి. లక్ష్మం నాయుడు. రైతు సంఘంనాయకులు గోపాలం. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న పాల్గొన్నారు.

జిల్లాలో మద్యం షాపులు కేటాయింపు

లాటరీ ప్రక్రియను ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : లాటరీ ద్వారా మద్యం షాపులను కేటాయించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ఈ ప్రక్రియలో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ లాటరీ తీశారు. జిల్లాలోని మొత్తం 153 షాపులకు గాను 5,242 దరఖాస్తులు అందాయి. వీటిని లాటరీ తీసేందుకు ఆడిటోరియంలో మొత్తం 10 కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటర్‌లో ఒక తాశిల్దార్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, సహాయ సిబ్బందిని నియమించారు. ముందుగా 1 నుంచి 10 షాపులకు కలెక్టర్, జెసి లాటరీ తీసి షాపులను కేటాయించారు. ప్రతీ షాపుకు ఇద్దరు రిజర్వు అభ్యర్థులను కూడా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. కెమేరాల్లో రికార్డు చేశారు.

సిసి కెమేరాల ద్వారా అధికారులు పర్యవేక్షించారు. ఎక్సైజ్ డిప్యుటీ కమిషనర్ ఎస్‌వివిఎస్ బాబ్జీరావు, సూపరిం టిండెంట్ బి.శ్రీనాథుడు, ఆర్డీవోలు డి.కీర్తి, రామ్మోహన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందగజపతి ఆడిటోరియంలో సాంస్కృతిక నీరాజనం

రెండోరోజూ వీనుల విందునిచ్చిన నృత్యాలు

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం ఉత్సవాలలో పట్టణంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో రెండోరోజు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. వరలక్ష్మి త్యాగరాజ సంగీత నృత్య కళానికేతన్, వాగ్దేవి బృందం, గీతిక, టి సత్యనారాయణ, పి సూర్యకుమారి, ఎస్.సత్య నారాయణ శర్మ, సౌమ్య, శ్రీ భగవతి నృత్య కళామందిర్, ఆరాధ్య తేజేస్వి, వర్ణ డాన్స్ అకాడమీలు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్య విన్యాసాలు వీనుల విందుగా నిలిచాయి. కె.రంజని, జి.రాధిక, కె.పద్మప్రియ, బాలభవన్, ఆముక్త మాల్యద, ఎం.సత్యసాయి రోజా, సత్యలత, రామ చంద్రశేఖర్, మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల వారు శాస్త్రీయ సంగీతాలను, భక్తి సంగీతాలను రమ్యంగా ఆలపించారు. వంశీకృష్ణ బృందం వీణ, ఎం.కామేశ్వరరావు ఫ్లూట్ వాయిద్యాలతో అలరించారు. ఘంటసాల స్మారక పీఠం వారు ఘంటసాల పాటలను ఆలపించారు. సోమవారం ప్రదర్శించిన కళాకారులకు వేదిక ఇంచార్జ్ లు ఆర్.డబ్ల్యూ. ఎస్ ఎస్.ఈ ఉమా శంకర్, డివిజనల్ పి.ఆర్.ఓ ఎస్.జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సియల్ శాస్త్రీ, డిప్యూటీ కలెక్టర్ సుధా రాణి తదితరులు మెమెంటోలను, సర్టిఫికేట్‌లను అందజేసి శాలువలతో సత్కరించారు.

పద్మనాభరాజు చెరువులో మూడుటన్నుల చేపలు మృతి

రెడ్‌విల్స్, శంకువ్యాధి సోకడమే కారణం

విశాలాంధ్ర-జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీలో ఉన్న పద్మనాభరాజు చెరువులో 3టన్నుల చేపలు మృతి చెందాయి. ఈచెరువులో ఇంగ్లాండ్ మత్స్యకారసొసైటీ చేపల పెంపకం చేస్తోంది. మత్స్యకారశాఖ సహకారంతో చేపడుతున్న ఈ చేపల పెంపకంలో భాగంగా దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో ప్రస్తుతం 10 టన్నులకు పైగా చేపలు ఉన్నట్లు సొసైటీ అధ్యక్షుడు ముంజూరు శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రోజు రోజుకూ చేపలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. దీనిపై పరీక్ష చేయించగా చేపలకు రెడ్‌విల్స్, శంఖువ్యాధి వంటి తెగుళ్ళు వచ్చినట్లు తేలిందన్నారు. ఇప్పటివరకు దాదాపు మూడు టన్నుల చేపలు మరణించాయని, నష్టం రూ.3 లక్షలు ఉందన్నారు.

తెగులు కారణంగానే మరణించాయి

సంతోష్, మత్స్యకార శాఖ ఇన్స్‌పెక్టర్

గతంలో ఎన్నడూ లేని విదంగా అన్నంరాజుపేటలోని పద్మనాభరాజు చెరువులో చేపలు మృతి చెందాయి. వీటికి రెడ్‌విల్స్ అనే తెగులు సోకింది. వీటి నివారణ చర్యలు సొసైటీ వారికి సూచించాం. ఈనష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. అయితే పరిహారం అంటూ ప్రభుత్వం నుంచి ఏమీ రాదు. కానీ చేపపిల్లలను మాత్రం ఉచితంగా అందజేస్తాం.

ఘనంగా తొలేళ్ల సంబరం

అమ్మవారిని దర్శించుకున్న మాన్సాస్ ఛైర్మన్ అశోక్ పట్టువస్త్రాలు సమర్పణ

కుటుంబ సమేతంగా ఎంపి కలిశెట్టి పూజలు

విశాలాంధ్ర-విజయనగరం: శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా జరిగింది. ఊరంతా పండగ శోభను సంతరించుకుంది. పులివేషాలు, కర్రసాము, కత్తిసాము, విచిత్ర వేషాలతో పట్టణంలో సందడి నెలకొంది. అమ్మవారికి మొక్కులు సమర్పించేందుకు భక్తులు బారులు తీరారు. ఘటాలతో, అమ్మవారి నామ స్మరణతో పట్టణం మారుమ్రోగింది. వివిధ ప్రాంతాలనుంచి పట్టణానికి భక్తుల రాక మొదలయ్యింది. పట్టణ ప్రధాన రహదారులు భక్తులతో నిండిపోయాయి. మాన్సాస్ ఛైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఎంఎల్‌ఏ అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఇతర కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. వారికి ఆలయ అధికారులు, పూజారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమ ర్పించారు. ఆలయ అధికారులు ఛైర్పర్సన్ కు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు జిల్లాకు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం 1.00 గంటలకు రాజమహేంద్రవరంలో బయలుదేరి 5.30 గంటలకు విజయనగరం చేరుకుంటారు. విజయనగరం ఉత్సవాల్లో 6 గంటలకు పాల్గొని రాత్రి 8 గంటలకు రాజ మహేంద్రవరం బయలుదేరి వెళతారు.

నీలమ్మ తల్లి, దేశమ్మ తల్లికి మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు

విశాలాంధ్ర -చీపురుపల్లి: మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద రావు విశాఖపట్నం నార్త్ నియోజకవర్గ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ ఆహ్వానంమేరకు నెల్లిమర్ల మండలం, బొడ్డపేట గ్రామంలో జరుగుతున్న శ్రీ నీలమ్మతల్లి, శ్రీ దేశమ్మతల్లి పండగ మహోత్సవంలో చీపురుపల్లి ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు సోమవారం అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఈ జిల్లా ప్రజలకు మంచి జరగాలని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి, చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు, యువనేత రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడులో కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మండలం మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, నెల్లిమర్ల మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి

విశాలాంధ్ర-విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని హోం మంత్రి అనిత, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వీరికి వేద పండితులు ఆశీర్వచనాలిచ్చి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పైడితల్లి అమ్మవారి జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్ లో ఆదర్శ పాఠశాల విద్యార్థికి ద్వితీయ బహుమతి

అభినందించిన పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది



విశాలాంధ్ర -మెరకముడిదాం: విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టు ఎగ్జిబిషన్ లో మెరకముడిదాం మండలం గర్భాం ఆదర్శ పాఠశాలకు చెందిన ఎం దుర్గాప్రసాద్ కు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. దుర్గా ప్రసాద్ ఆదర్శ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నాడు.దుర్గా ప్రసాద్ తయారుచేసిన వాయిస్ కంట్రోల్ రోబోట్ కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ బహుమతిని విజయనగరం నోడల్ టీచర్ ఇంచార్జి ఎన్ ప్రశాంత్ బాబు చేతులు మీదుగా దుర్గాప్రసాద్ సోమవారం నాడు అందుకున్నారు. దుర్గా ప్రసాద్ ను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డివిఎస్ అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

ఎంపీడీవో వై భవాని

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో 14 సోమవారం నుండి ఈ నెల 20 వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై భవాని ఒక ప్రకటనలో తెలిపారు దానిలో భాగంగా మంగళవారం సింగవరం చొల్లంగి పేట కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు కావున సంబంధిత శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో హాజరుకావాలని తెలిపారు.

రామారావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

ఎంపీపీ జెడ్పీటీసీ

విశాలాంధ్ర-వంగర : అనారోగ్యంతో ఇటీవలే మరణించిన వంగర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొత్స రామా రావు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వంగర మండల పరిషత్ అధ్యక్షులు ఉత్తారావెల్లి సురేష్ ముఖర్జీ, జడ్పిటిసి ప్రతినిధి కరణం సుదర్శన్ రావు, పాలవలస ధవలేశ్వర రావు, మండల పరిధిలో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీపీ,మాజీజడ్పిటిసి సభ్యులుబొత్స వాసుదేవరావు నాయుడు వారి వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

పెరుమాలిలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీ నాయన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సోమవారం పెరుమాలిలో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బేబీ నాయన చేతుల మీదుగా ప్రారంభించారు. మండలంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా ప్రభుత్వము మండలానికి 120 రోడ్లు, సీసీ కాలవలు గాను ఏడు కోట్ల 19 లక్షలు రూపాయలు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. ఇంతకుముందుగా స్థానిక సర్పంచ్, మరియు నాయకులను స్థానిక ఎస్సీ మహిళలు మా కాలనీలకు ఎందుకు రోడ్లు వేయడం లేదని, రెండు మూడు ఇళ్ళ ముందు రోడ్లు ఏమిటని ప్రశ్నించారు. ఇంతలో కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే బేబీ నాయన కలుగజేసుకొని మీ కాలనీకి రోడ్లు, కాలువలు నేను వేయిస్తాను అని హామీ ఇవ్వడంతో మహిళలు ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్ వెంకట్ నాయుడు, ఎంపీడీవో రేగు. రాంబాబు, హెచ్ డి టి జి సత్యనారాయణ, ఏపీవో కే. సుశీల, ఐ సి డి ఎస్ పి ఓ రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ వి. సత్యం నాయుడు, రాజశేఖర్, ఏ ఎస్ ఐ మల్లేశ్వరరావు, స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాజాంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాలాంధ్ర-రాజాం: బంగాళా ఖాతంలో అల్పపీడనం కారణంగా ఈ నెల 17 వరకు మున్సిపల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు రాజాం మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కమీషనర్ జె. రామప్పలనాయుడు తెలిపారు. సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు.

సామాన్యుడి నడ్డి విరుస్తున్న నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయాలి

లోక్‌సత్తా డిమాండ్

Lok Satta Party

విశాలాంధ్ర-బొబ్బిలి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని అదిక ధరలు అదుపు చేయడానికి సంబంధిత శాఖ మంత్రి చర్యలు చేపట్టాలని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత కొంత కాలం నుండి అనూహ్యంగా నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు అమాంతం ఆకాశాన్ని అంటాయి. ప్రభుత్వం ఈ ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. కేవలం రైతు బజారు ఉన్న చోట మాత్రం రాయితీ మీద నూనె, టమాటా ప్రభుత్వం ఇచ్చే ఏర్పాటు చేసింది. మరి రైతు బజారు లేనిచోట ప్రజల పరిస్థితి ఏమిటి? బజారులో ఏ ధర చెబితే ఆ ధరకు కొనుక్కోవటమేగా మరి. 99 రూపాయలకే నాణ్యమైన మద్యం ఇస్తాం అని ప్రకటించిన ప్రభుత్వం నిత్యావసర సరుకులు, కూరగాయలు ప్రజలకు రాయితీ మీద ఇవ్వలేరా? రాష్ట్రంలో మద్యం పాలసీ అమలు చేసే విధానం మీద ఉన్న శ్రద్ధ నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై లేదు. దసరా పండగ నాడు తెల్ల రేషన్ కార్డు దారులకు ఇస్తానన్న చంద్రన్న కానుకలు లేవు, కనీసం కంది పప్పు కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు ఇవ్వలేకపోయారు. సామాన్యులు ఎలా ఇబ్బందులు పడినా మనం మాత్రం సంపద సృష్టిలో భాగంగా మద్యం పాలసీ అమలు చేసి డబ్బులు పిండుకోవడమే. నాణ్యమైన మద్యం ఇస్తే ఆ కుటుంబంలో ఒక్కడే తాగి అనారోగ్యం పాలవుతాడు. నాణ్యమైన నిత్యావసర సరకులు రాయితీపై ఇస్తే ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యంగా జీవిస్తారు. కనీసం ఇకనైనా పాలకులు, అధికారులు సమీక్ష చేసి దళారుల బెడద లేకుండా చేసి ప్రజలకు కనీస ధరలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించే ఏర్పాటు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. బొబ్బిలిలో రైతు బజారు లేకపోవడం వలన బహిరంగ మార్కెట్ లో వ్యాపారస్తులు ఏ ధర చెబితే ఆ ధరకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసే పరిస్థితి. దీనివల్ల సామాన్యులు, మధ్యతరగతి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటు చెయ్యమని పాలకులని, అధికారులని ఎన్ని సార్లు చెప్పినా ఏర్పాటు చెయ్యడం లేదుని పాలకులు మారుతున్నారే తప్పా ప్రజల కోసం రైతు బజారు కూడా ఏర్పాటు చెయ్యలేని నిస్సహాయస్థితిలో మన పాలకులు,అధికారులు ఉన్నారని ఆరోపించారు. కనీసం ఈ కూటమి ప్రభుత్వ నాయకులు అయినా స్పందించి తక్షణమే బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటు చేసి సామాన్యులను ధరాభారం నుండి ఆదుకోవాలని కోరారు.

తోటపల్లి కాల్వ నుండి నీరందించాలి

ఎంఎల్‌సీ ఎంపీపీ, జెడ్పీటీసీలు

విశాలాంధ్ర-వంగర : తోటపల్లి కుడి ప్రధాన కాల్వ నుండి పంటపొలాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎం ఎల్ సీ పాలవలస విక్రాంతు, ఎంపీపీ సురేష్ ముఖర్జీ,జెడ్పీటీసీ ప్రతినిది కరణం సుదర్శన రావు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.సోమవారం నాడు వంగర మండల పరిషత్ కార్యాలయం లో విలేఖర్లతో మాట్లాడారు. తోటపల్లి కుడి ప్రదాన కాల్వ శివారు ఆయకట్టు భూమికి చుక్క నీరు పొట్టదశలోనున్న చేలు ఎండి చనిపోతున్నాయనీ, భూములు ఎండి బీటలు వారాయ ని రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయమే ఆదారంగా పిల్లాపాపలతో ఆరుగాలం కష్టించి పంటచేతికొచ్చేదశలో కళ్లముందే పంటలు చనిపోతే దిక్కుతోచనస్థితి లో ఉన్నామన్నారనీ, శివారు గ్రామాల్లో పంట పొలాలకు సాగు నీరందించటానికి చర్యలు తీసుకొని, పంటలు ఎండకుండా వరి పంటలు కాపాడాలని కోరారు.పొట్ట దశలో ఉన్న టువంటి వరి పంట చేలకు పంటకాల్వ ద్వారా సాగు నీరు గత కొన్నిరోజులుగా అందక పోవటంతో వరి పంట చేనినాశనం కాక తప్పదని, వెంటనే ఎండి పోతున్న ఆయకట్టు పొలాలకు నీరు అందే టట్లు చూడా లని వారు హెచ్చరించారు. వంగర మండల పరిదిలో వరి పంటలకు తోటపల్లి కుడికాల్వ సాగునీరందించి పంటలను కాపాడాలని రైతులు అవేదనను పట్టించుకోని వరి రైతులను వేలాది ఎకరాల పంట పొలాలను, మరికొద్దిరోజుల్లో వరి పంట చేతికి అంది రానున్నదని, అదే కాల్వ ద్వారా నీరు అందక పంట పాడై పోతే, రైతు బతుకు నాశనం కావటం తథ్యమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికాలం బతక వలసిన బతుకు పాడై, ఆరుగాలం కష్టించి పనిచేవివివరకు నీరందక పోతే రైతు పరిస్థితెంటని వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత తోటపల్లి ఇంజినీరింగ్ అధికార్లు సరియైన ఈ సమయంలో సాగు నీరు అందించక పోవటం వల్ల కంటిమీద కునుకులేకుండా ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే సాగు నీరు అందేటట్లు చూసి రైతులను అధికోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వీ పాటు పలుగ్రామ సపం చులు,ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు. ఒక చుక్కనీరు రాక పొట్టదశలో నున్న చేలు ఎండిచనిపోతున్నాయి. భూములు ఎండి బీటలు వారాయ ని రైతులు పెంకిగౌరీశ్వరరావు గుడివాడ గోవిందరావు అన్నారు వ్యవసాయమే ఆదారంగా పిల్లాపాపలతో ఆరుగాలం కష్టించి పంటచేతికొచ్చేదశలో కళ్లముందే పంటలు చనిపోతే దిక్కు తోచనస్థితి లో ఉన్నామన్నారు జిల్లా కలక్టర్ అది కార్లను పంపించి వాస్తవాలు తెల్సుకుని కొత్తవల్స బంగారు వల్స కొప్పరవల్స బంగారువల్స రుషింగి మద్దివల్స కొట్టిశ గ్రామాలకు నీరందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ..

పైడితల్లి అమ్మవారి చల్లని ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలి : జడ్పీటీసీ వలిరెడ్డి



విశాలాంధ్ర-చీపురుపల్లి : ఉత్తరాంధ్రుల ఇలివేల్పు, విజయనగరం ప్రజల ఆరాధ్య దేవత శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా 2వ రోజు చీపురుపల్లి జడ్పిటిసి వలి రెడ్డి శిరీష అమ్మవారిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీపురుపల్లి జడ్పీటీసీ వలి రెడ్డి శిరీషతో పాటు విజయనగరం జిల్లా వైస్సార్సీపీ కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ప్రభాత్ కుమార్, మహంతి మురళి, వెంకీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి అశీస్సులు ప్రజందరి పై ఉండాలి అని తెలియజేసారు. ఏపీలోని విజయనగరానికి దసరా వచ్చిందంటే చాలు పండగ వాతావరణం నెలకొంటుంది. ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబురాలు దసరా నుంచి ఆరంభమవుతాయి. దసరా మొదలుకుని పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబురం వరకు విజయనగరమంతా సర్వాంగ సుందరంగా సిద్ధమవుతుంది. పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఏటా ఘనంగా జరుగుతుంది. విజయదశమి అనంతరం వచ్చే మంగళవారం నాడు జరిగే సిరిమానోత్సవానికి ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారు. అని అన్నారు. రేపు పండగ ముఖ్యమైన రోజు సిరిమానోత్సవంపైడితల్లి అమ్మవారి దేవస్థానంలో జరిగే ప్రధాన పండగ సిరిమానోత్సవం. రాష్ట్రంలో ఎన్నో ఉత్సవాలు జరుగుతున్నా విజయనగరం గ్రామ దేవత పండగకు ఓ విశిష్టత ఉంది. తోలేళ్ల ఉత్సవం జరిగిన మరుసటి రోజున సిరుమాను సంబరం జరుగుతుంది. పైడిమాంబ కోరిక మేరకు పతివాడ అప్పలనాయుడు వంశస్థులే వంశపారపర్యంగా పైడిమాంబకు పూజలు చేస్తున్నారు. ప్రతి ఏడు పతివాడ వంశస్తులు, సిరిమానును అధిరోహించే వారు ఎవరైతే వారి కలలోకి వచ్చి సిరిమాను ఏ ప్రదేశంలో ఉందో పైడిమాంబ చెబుతుం దంటారు. అమ్మవారు ప్రధాన పూజారి కలలో చెప్పినట్లుగా ఎక్కడ ఉందో వెతికి నలభై అడుగుల చింత చెట్టు మానును సేకరించి పసుపు కుంకుమలతో పూజ చేసి అమ్మవారి ప్రతిరూపంగా భావించి, సిరిమానోత్సవం కోసం ఆ చెట్టును మొదలు నుంచి సేకరిస్తారు. అలా పూజలు చేసి సేకరించిన సిరుమానును విజయనగరంలోని హుకుం పేటకు తరలిస్తారు. అక్కడ సిరిమానును అధిరోహించే పూజారి కులస్థులు సిరిమాను రథాన్ని తయారుచేస్తారు. పూజారి కూర్చోవటానికి వీలుగా ఓ శీలను తయారు చేస్తారు. అలా తయారు చేసిన శీలలోనే సిరిమానోత్సవం రోజున ప్రధాన అర్చకులు ఆశీనులౌవుతారు. అలాగే ఇక్కడే అమ్మవారి పాలధార, జాలరి(బెస్త) వల, తెల్ల ఏనుగు అంబారీలు కూడా తయారవుతాయి. సిరిమాను ఊరేగింపులో భాగంగా 55 అడుగుల ఎత్తు ఉండే ఈ సిరిమానును ఎక్కడా మేకులు లేకుండా కేవలం ఇరుసులతో మాత్రమే ఏర్పాటు చేయడం ఓ విశేషం. ఈ తయారీ అంతా హుకుంపేటలో ఒక వేడుకలా చేస్తారని అన్నారు.

విజయనగరం సర్కిల్ ఆఫీసు నందు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం తో భారీ వర్షాల సూచన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్, ఎమ్.లక్ష్మణ రావు తెలిపారు ఎటువంటి విపత్కర పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ , తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్, విశాఖపట్నం ఆదేశాల మేరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకుగాను జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం, విజయనగరం నందు 9490610102 (%వాట్ప్ ఎప్%) నెంబర్ తో 24 గంటలపాటు 3 షిఫ్టులలో పనిచేసే విధంగా కంట్రోల్ రూం ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వర్షాల కారణంగా 'తెగిపడిన విద్యుత్ వైర్లను గాని, తడిసిన విద్యుత్ స్తంభాలను గాని, విద్యుత్ వైర్ల పై తెగిపడిన చెట్ల కొమ్మలను గాని ప్రజలు నేరుగా తాక వద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకు రబ్బరు చెప్పులను ధరించడం శ్రేయస్కరం. వ్యక్తిగత భద్రత ముఖ్యమని, అన్నింటి కన్నా ప్రాణం మరింత ముఖ్యమైనదని తెలియ జేశారు.వర్షములు కారణముగా ఏదైనా విద్యుత్ అంతరాయము లేదా సమస్య తలెత్తినచో దగ్గరలో గల విద్యుత్ సెక్షన్ ఆఫీసునకు గాని, టోల్ ఫ్రీ నంబరు 1912 కు గాని కంట్రోల్ రూమ్, సర్కిల్ ఆఫీస్, విజయనగరం నెంబర్-9490610102 నకు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేసుకొన్న యెడల సమస్య వెంటనే పరిష్కరించబడునన్నారు.

రోడ్లు, కాలువల నిర్మాణానికి వంద రోజుల్లోపు రూ.30కోట్ల నిధులు విడుదల

పల్లె పండుగ లో రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోండ్రు

విశాలాంధ్ర-రాజాం: రాజాం మండలం శ్యాంపురం పంచాయితీలో 'పల్లె పండుగ' వారోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. అనంతరం రోడ్లకు శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో రోడ్లు , కాలువల నిర్మాణం కోసం వంద రోజుల్లోపు రూ.30కోట్ల నిధులను కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇది కూటమి ప్రభుత్వం చారిత్రక విజయం అని అన్నారు.దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.రాజాం మండలంలో 94 సీసీ రోడ్ల గ్రాంట్లు మంజూరు అయ్యాయన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని అన్నారు.నేడు కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో ఉన్న గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పెట్టిందన్నారు.గ్రామ సర్పంచ్ లకు ఎంతో గౌరవం పెరిగిందన్నారు.దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంక్షేమ అభివృద్ధి పాలన కొనసాగు తుందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణ ప్రక్రియ కుంటిపడిందని విమర్శిం చారు. ఆ సమస్యను పరిష్కరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యతతో కూడిన రహదారులు అందుబాటులోకి వచ్చేవి.తద్వారా గ్రామీణ అభివృద్ధి సాధ్యపడేదన్నారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణంవల్ల పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు మెరుగవుతాయనే విషయాన్ని అందరం దృష్టిలో పెట్టుకోవాలన్నారు. జగన్ రెడ్డి హయాంలో గ్రామీణ ప్రాంతాలు పూర్తిగా మరుగునపడ్డాయి. గ్రామాభివృద్ధికి కేంద్రం నిధులను దారిని మళ్లించడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేకపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సుమల వెంకట మన్మథరావు,నంది సూర్య ప్రకాశరావు, పిన్నింటి మోహన్‌రావు, కిమిడి అశోక్ కుమార్, ఎలకల దుర్గబాబు, కర్నెన మహేష్,లచ్చు భక్త కృష్ణమూర్తి, చీడి రమేష్, బోనంగి నారాయణ రావు,బి దాలి నాయుడు,ఎల్ అప్పల నాయుడు,ఎడ్ల పావయ్య, మద్దు హరి,జనసేన నేత యు.పి.రాజు, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది తదితర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంగీత నవావధానం, సాహితీగోష్ఠిలో ప్రముఖ సాహితీవేత్తలు

విశాలాంధ్ర-విజయనగరం: విజయ నగరం ఉత్సవాల్లో భాగంగా ఎం. ఆర్.లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉన్న సాహిత్య వేదికపై సోమవారం నిర్వహించిన సాహితి గోష్ఠి, సంగీత నవావదానం ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. సాహితి గోష్ఠి కార్యక్రమంకు డా. జక్కు రామకృష్ణ, రాధిక అనుసంధానకర్తలుగా వ్యవహరించారు. డా.జి.వి.ఎస్. జయపాల రావు, అనురాధ పరశురాం, బి.సుభద్ర, లగుడు వరలక్ష్మి, సంగీత నవావదానం కు కళారత్న డా. మీగడ రామలింగ స్వామి సభాధ్యక్షులుగా పాల్గొన్నారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాలను డా. జనార్దన్ నాయుడు, డైట్ కళాశాల ప్రిన్సిపల్ తిరుపతి నాయుడు, జిల్లా సహకార అధికారి రమేష్ గారు మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ గారు తదితరులు పాల్గొన్నారు.